# ఆయన మనకు ప్రవక్తలను అనుగ్రహించాడు

రెండవ పాఠము

## ప్రవక్త యొక్క పని

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.

# విషయ సూచిక


ఉపోద్ఘాతము .... 1

పనుల పేర్లు .... 1

- ప్రాథమిక పదము .... 1
- ద్వితీయ పదములు .... 2

పని పరివర్తనాలు .... 5

- రాజులకు మునుపు కాలము .... 6
- రాజుల కాలము .... 6
- చెర కాలము .... 7
- చెర-తరువాత కాలము .... 8

పని అంచనాలు .... 8

- సుప్రసిద్ధ నమూనాలు .... 9
  - శకునము/షమన్ .... 9
  - భవిష్యత్తును తెలిపేవారు .... 9
- నిబంధన నమూన .... 9
  - గత అవగాహనలు .... 10
  - సమకాలీన అవగాహనలు .... 10

ముగింపు .... 13

# ఉపోద్ఘాతము

మా సంస్కృతిలో, ఇద్దరు వ్యక్తులు మొదటిసారిగా కలిసినప్పుడు, ఒకరి పేరు మరొకరినికి తెలియజేయుట వారు చేసే మొదటి పని. అయితే సాధారణంగా వెంటనే వారు ఈ ప్రశ్న అడుగుతారు: "మీరేమి పని చేస్తున్నారు?" అనేక విధాలుగా, ఈ పాఠంలో ప్రవక్తలను గూర్చి మనం ఇదే అడుగబోవుచున్నాము. మనము ఇలా అడగాలని ఆశించుచున్నాము: "పాత నిబంధన ప్రవక్తలు ఎలాంటి పని చేశారు?"

ఈ పాఠమునకు మేము "ప్రవక్త యొక్క పని" అను పేరు పెట్టాము. ప్రవక్త యొక్క పనిని గూర్చి అన్వేషించుచుండగా, మూడు విషయాలను మనం పరిశీలిద్దాము: మొదటిగా, ప్రవక్తలు చేయు పనుల పేర్లు; రెండవదిగా, పని పరివర్తనాలు — ప్రవచనములో జరిగిన మార్పులు — మరియు చివరిగా ప్రవక్తల పని యొక్క అంచనాలు — ఆయన ప్రవక్తలు చేయాలని దేవుడు ఆశించిన పనులు.

పాత నిబంధన ప్రవక్తలు చేసిన పనుల పేర్లను అన్వేషిస్తూ ఈ పాఠమును ఆరంభిద్దాము.

# పనుల పేర్లు

అనుదిన జీవితములో ప్రజలను అనేక పేర్లతో మనం పిలుస్తాము; వాస్తవానికి, ఒకే వ్యక్తిని రకరకాల పేర్లతో మనం పిలుస్తాము. ఉదాహరణకు, ఒకే వ్యక్తిని, కాపరి అని, జెట్టివాడు అని, వాయిద్యకారుడు అని పిలుస్తాము. ఎందుకు? ఎందుకంటే ప్రజలు అన్ని రకాలైన పనులు చేస్తారు. సరే, పాత నిబంధన గ్రంథములో, పాత నిబంధన ప్రవక్తల విషయంలో కూడా ఇదే వాస్తవమైయున్నది. వారికి అనేక బిరుదులు ఇవ్వబడినవి.

ప్రవక్తలకు పాత నిబంధన ఉపయోగించిన వివిధ పేర్లను అన్వేషించుటకు మనము రెండు మౌలికమైన విభాగములను చూడబోవుచున్నాము. మొదటిగా, బైబిలులో ప్రవక్త కొరకు ఉపయోగించబడిన ప్రాథమికమైన పదమును మనం చూద్దాము. మరియు రెండవదిగా, ఈ పనిని పురమాయించుటకు బైబిలు ఉపయోగించే ద్వితీయ పదముల కలగలుపులను మనం పరిశీలిద్దాము. ప్రవక్తలకు ఉపయోగించబడిన ప్రాథమిక పదమును మొదటిగా చూద్దాము.

## ప్రాథమిక పదము

"ప్రవక్త" అను పదమును ఆంగ్ల భాష-మాట్లాడు క్రైస్తవులు విినప్పుడు, ప్రవక్త అనగా జ్యోతిష్కుడు లేదా అతీంద్రియ శక్తి ఉన్న వ్యక్తి వలె భవిష్యత్తును గూర్చి చెప్పేవాడు అని ఆలోచిస్తుంటారు. పాత నిబంధన ప్రవక్తలు భవిష్యత్తును గూర్చి చెప్పేవారు అనేది నిజమే, కాని వారి పాత్ర దీనికి

మించినదిగా ఉంది. వాస్తవంగా చెప్పాలంటే, “ప్రాఫెట్” అను ఆంగ్ల పదము కూడా భవిష్యత్తును గూర్చి చెప్పువానికంటే ఎక్కువ అర్థమును కలిగినదిగా ఉన్నట్లు మనకు ఒక సూచన కనిపిస్తుంది.

ఆంగ్ల భాష మాట్లాడేవారు “ప్రవక్త” అను పదమును పాత నిబంధన యొక్క గ్రీకు అనువాదమైన సెప్టుజెంట్ నుండి పొందుకున్నారు. మనము చాలాసార్లు దీనిని గ్రహించలేము, కాని గ్రీకు పదమైన *ప్రాఫెటెస్* (*προφήτης*) నుండి మన ఆంగ్ల పదమైన “ప్రాఫెట్” వస్తుంది, ఇది పరిస్థితులకు అనుగుణంగా మార్పు చెందగలిగే గుణం కలిగినది. ఈ పదము రెండు పదాల యొక్క కలయికగా ఉంది. గ్రీకు పదమైన *ప్రాఫెటెస్* యొక్క రెండవ మూలకము *ఫెటెస్* (*φητης*) అయ్యున్నది మరియు ఇది మాట్లాడుట అను అంశమును సూచిస్తుంది. ప్రవక్తలు ఎక్కువగా మాట్లాడేవారు మరియు వ్రాసేవారు అని ఇది సూచిస్తుంది. ఇది తగినంత సరళంగా ఉంది, కాని *ప్రాఫెటెస్* అను పదములోని మొదటి మూలకమైన *ప్రా* (ప్రో)ను, రెండు దిశలలో సూచించవచ్చు. ఇది ఒకవైపున “ముందే మాట్లాడడం” లేదా “ముందుగా చెప్పడం,” అను అర్థమిస్తుంది, మరొకవైపు,ఇది కేవలం “మాట్లాడడం” లేదా “ప్రకటించడం” అను అర్థమిస్తుంది. కాబట్టి ప్రవక్త అనగా ముందుగా మాట్లాడువాడు లేదా ప్రకటించువాడునైయున్నాడు. వాస్తవంగా చెప్పాలంటే, పాత నిబంధన ప్రవక్తలు రెండు పనులను చేశారు. వారు భవిషత్తును గూర్చి మాట్లాడారు, మరియు తమ దినములను గూర్చి కూడా వారు ధైర్యంగా మాట్లాడారు. “ప్రవక్త” అను ప్రాధమిక పేరు వీరు చేసిన వివిధమైన పనులను సూచిస్తుంది.

హెబ్రీ పాత నిబంధనను మనం చూసినప్పుడు, “ప్రవక్త” అను పదముకు విస్తృతమైన అర్థము ఉన్నదని కనుగొంటాము. *ప్రాఫెటెస్* (*προφήτης*) అను గ్రీకు పదము సెప్టుజెంట్లో *నబి* (*נָבִיא*) అను ఒక నిర్దిష్ట హెబ్రీ పదమును అనువదించడానికి ఉపయోగించే పదమైయున్నది. ప్రాచీన పశ్చిమ ఆసియలోని ఇతర భాషలను పోల్చి చూస్తే, *నబి* అను పదమునకు అర్థం “పిలువబడిన వ్యక్తి” అని మనము యెరిగియున్నాము. ఇది పరిస్థితులకు అనుగుణంగా మారగలిగే గుణం కలిగిన పదమైయున్నది, మరియు ప్రవక్త దేవుని చేత పిలువబడిన వ్యక్తి అని ఇది సూచిస్తుంది. వారు సాధరణమైన ప్రజలు కాదు; అనేక విశేషమైన పనులను చేయుట కొరకు దేవుడు వారిని పిలచాడు.

*నబి* అని ఒక ప్రవక్తకు ఇవ్వబడిన ప్రాధమిక పేరుతో పాటుగా, పాత నిబంధన గ్రంథములో ప్రవక్త స్థానముతో అనుసంధానంగా ఉన్న అనేక ద్వితీయ పదములు ఉన్నాయి. ఈ అనేక ద్వితీయ పదముల యొక్క ప్రాముఖ్యతను మనము చూద్దాము.

## ద్వితీయ పదములు

మొదటిగా, ప్రవక్తలు తరచుగా *ఎబెద్* (*עֶבֶד*), లేదా దాసుడు అను పేరుతో కూడా పిలువబడేవారు. పాత నిబంధన గ్రంథములో అనేకమందిని దాసులు అని పిలిచేవారు, మరియు ఈ పదము ఎల్లప్పుడు ఒక విధమైన విధేయతను లేదా వినయమును సూచిస్తుంది. అయితే ఈ పేరు ప్రవక్తలకు ప్రాముఖ్యమైనది, ఎందుకంటే ఇది చాలాసార్లు ఒక అధికారి లేదా ఆఫీసరును, ప్రత్యేకంగా న్యాయస్థానంలోని అధికారిని సూచించు విధముగా ఉంటుంది. ఇశ్రాయేలు రాజులు కూడా దేవుని దాసులని పిలువబడేవారు ఎందుకంటే వారు దేవుని పరలోక, న్యాయస్థానంలో అధికారిక స్థానములను పొందిన సామంత రాజులైయున్నారు.

దేవుని న్యాయస్థానంలో ప్రవక్తలు ప్రత్యేక పాత్రలను పోషించారు. వారు పరలోక సింహాసనముకు ప్రతినిధులుగా పనిచేశారు. వారు గొప్పరాజు తరుపున మాట్లాడిన అధికారిక దాసులైయుండిరి. ఈ కారణంగానే ప్రవక్తలను తిరస్కరించుట ఇశ్రాయేలు చేసిన గొప్ప పాపము అని దానియేలు ఒప్పుకున్నాడు. దానియేలు 9:5లో అతడు మాట్లాడిన విధానమును వినండి:

> **మేమైతే నీ దాసులగు ప్రవక్తలు నీ నామమును బట్టి ... చెప్పిన మాటలను ఆలకింపక (దానియేలు 9:5)**

ప్రవక్తలు సాధారణ ప్రజలు కాదు. దేవుని న్యాయస్థానంలో దాసులుగా వారు పరలోక సింహాసనమునకు ప్రాతినిధ్యం వహించారు.

అంతేగాక, దగ్గర సంబంధం కలిగిన రెండు హెబ్రీ పదములు ప్రవక్తలు పోషించిన, మరో ప్రత్యేకమైన పాత్రను సూచిస్తున్నాయి. హెబ్రీ పదమైన *రోయెహ్* (*רֹאֶה*) అనగా "దీర్ఘదర్శకుడు" అని అర్థం మరియు ఇది *హోజెహ్* (*חֹזֶה*) అను పదముతో దగ్గరగా అనుసంధానించబడింది, దీనికి "దీర్ఘదర్శి" లేదా "పర్యవేక్షకుడు" అని అర్థం. 1 సమూయేలు 9:9 ప్రకారం, ఇశ్రాయేలులో రాజత్వము రాకమునుపు ప్రవక్తలు దీర్ఘదర్శులు అని పిలువబడేవారు. ఇశ్రాయేలులో మునుపు, నేటి ప్రవక్త దీర్ఘదర్శి అని పిలువబడేవాడు. అదే విధంగా, 2 సమూయేలు 24:11లో, దావీదునకు దీర్ఘదర్శియైన గాదు కూడా హోజెహ్, లేదా దీర్ఘదర్శి అని పిలువబడ్డాడు —

> **దావీదునకు దీర్ఘదర్శియగు గాదునకు యెహోవా వాక్కు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను (2 సమూయేలు 24:11).**

ప్రవక్తకు ఇవ్వబడిన ఈ పేరులు వారి పనిని గూర్చి ఏమి తెలియజేస్తాయి? ప్రవక్తలు దేవుని వాక్కును పొందుకొనుచుండగా వారు అనుభవించిన అతి ప్రాముఖ్యమైన అనుభవమును ఈ పేరులు సూచిస్తాయి. ప్రవక్తలను దీర్ఘదర్శులు అని పిలుస్తారు ఎందుకంటే పరలోక ప్రదేశములు చూచే హక్కు వారికి ఇవ్వబడింది. 2 దినవృత్తాంతములు గ్రంథములో, ప్రవక్తయైన మీకాయ బెన్-ఇమ్లా చెప్పిన ప్రవచనమును వివరించమని అతనికి సవాలు చేయబడింది. ప్రతిస్పందనగా, మీకాయ తాను పొందుకొనిన పరలోక దర్శనమును వివరించాడు. 2 దినవృత్తాంతములు 18:18-19లో, ప్రవక్త పరలోకములో చూసిన దర్శనమును వివరించుటను మనం చదువుతాము.

> **యెహోవా తన సింహాసనముమీద ఆసీనుడైయుండుటయు, పరమండల సైన్యమంతయు ఆయన కుడిప్రక్కను ఎడమప్రక్కను నిలువబడుటయు నేను చూచితిని. ఇశ్రాయేలు రాజైన అహాబు ... పోయి పడిపోవునట్లు ఎవడు అతని [ప్రేరేపించునని] యెహోవా అడుగగా, ఒకడు ఈ విధముగాను ఇంకొకడు ఆ విధముగాను ప్రత్యుత్తరమిచ్చిరి (1 దినవృత్తాంతములు 18;18-19).**

ప్రవక్తలు దీర్ఘదర్శకులుగా ఎందుకు పిలువబడతారో చూపించుటకు ఇది ప్రసిద్ధిగాంచిన వాక్యభాగము. వారు పరలోక ప్రదేశములోకి చూశారు. వారు దేవుని మాట ఆలకించారు. కార్యములు జరుగుటను వారు చూశారు. పరలోక ప్రదేశములలో వారు దేవునితో సంకర్షించారు. మరియు ప్రవక్తలను



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

గూర్చి మనం నేర్చుకొనుచుండగా, ఈ విధమైన పరలోక అనుభవములు వారి యొక్క పరిచర్యకు కేంద్రముగా ఉన్నాయని గుర్తుంచుకోవడం ప్రాముఖ్యమైన విషయం.

ప్రవక్తల కొరకు అరుదుగా ఉపయోగించబడిన మరొక హెబ్రీ పదము *ఛోఫేహ్ צֹפֶה*), లేదా "కాపలావాడు," "కాపలా కాయువాడు." ఈ పదము ప్రవక్తలను ప్రాచీన ఇశ్రాయేలులో ఒక సాధారణ కాపలాదారుని పనితో పోల్చుతుంది. ప్రాచీన ప్రపంచములోని పట్టణములకు కాపలాదారులు ఉండేవారు, వారు వచ్చి పోవు సందర్శకులందరినీ పరిశీలించేవారు. ప్రవక్తలు కూడా శత్రువులను కనిపెట్టుట ద్వారా మరియు ఆశీర్వాదము మరియు తీర్పులో దేవుని విధానమును కనిపెట్టుట ద్వారా ఇదే చేశారు. ఉదాహరణకు, యెహెజ్కేలు 3:17లో, దేవుడు ప్రవక్తయైన యెహెజ్కేలుతో ఈ విధముగా మాట్లాడాడు:

> నరపుత్రుడా, ఇశ్రాయేలీయులకు కావలిగా నేను నిన్ను నియమించియున్నాను, కాబట్టి నీవు నా నోటిమాట ఆలకించి నేను చెప్పినదానినిబట్టి వారిని హెచ్చరిక చేయుము (యెహెజ్కేలు 3:17).

బైబిలు కాలములలో, శత్రువుల దాడి లేదా స్నేహితుల సందర్శనను గూర్చి ముందుగా హెచ్చరించుట పట్టణ శ్రేయస్సు కొరకు ప్రాముఖ్యమైనదిగా ఉండేది. ప్రజలకు సిద్ధపడే అవకాశం ఉండుటకుగాను, ఆయన ప్రవక్తలు ఎల్లప్పుడు రాబోవు నాశనమును మరియు ఆశీర్వాదములను కనిపెట్టేవారని దేవుడు బయలుపరచాడు. ప్రవక్తలు తరచి చూస్తూ, కలలలో మరియు దర్శనములలో జరగబోవు విషయములను చూసి, ప్రజల వద్దకు వెళ్లి వాటిని గూర్చి ముందుగా ప్రకటించేవారు.

ప్రవక్తలు కొన్ని సందర్భములలో హెబ్రీ పదమైన *మలాక్* (מַלְאָךְ) అనగా "దూత" అని కూడా పిలువబడేవారు. పాత నిబంధన యొక్క ప్రాచీన ప్రపంచములో టెలిఫోన్లు, ఈ-మెయిల్ లు, టెలివిజన్లు లేవు. ఎక్కువ దూరం సమాచారం పంపడానికి ఏకైక మార్గం మానవ దూతలు, మరియు దూతలు ఒక వ్యక్తి యొద్ద నుండి, ఎక్కువగా రాజు లేదా మిలటరీ జనరల్ నుండి సమాచారమును పొంది, దానిని గ్రహీతలకు అందించేవారు. సంభాషించవలసిన అత్యవసరత ఏర్పడినప్పుడు చాలాసార్లు దూతలను ఉపయోగించేవారు. పాత నిబంధన ప్రవక్తలను ఈ పేరుతో పిలుస్తుంది ఎందుకంటే వారు దేవుని యొద్ద నుండి సందేశమును అందుకొని ఆ అత్యవసర సందేశమును దేవుని ప్రజలకు తెలియజేసేవారు. ఉదాహరణకు, కొందరు యూదులు బబులోను చెర నుండి యెరూషలేముకు తిరిగి వచ్చినప్పుడు, వారు తీవ్రంగా నిరుత్సాహపడ్డారు. కాబట్టి, దేవుడు ప్రవక్తయైన హగ్గయిని పిలచి, సందేశమునిచ్చి అతనిని పంపించెను. ఈ కారణమును బట్టి, హగ్గయి 1:13 ప్రవక్తను గూర్చి ఈ మాటలు చెబుతుంది:

> అప్పుడు యెహోవా దూతయైన హగ్గయి యెహోవా తెలియజేసిన వార్తనుబట్టి జనులకు ప్రకటించినదేమనగా "నేను మీకు తోడుగా ఉన్నాను; ఇదే యెహోవా వాక్కు" (హగ్గయి 1:13).

ప్రవక్తలు దేవుని ప్రజల మీద తమ సొంత ఆలోచనలను రుద్దరు అని "దూత" అను బిరుదు స్పష్టం చేస్తుంది. విరుద్ధంగా చెప్పాలంటే, వారు యెహోవా దూతలుగా పనిచేసి దేవుని పక్షమున మాట్లాడారు.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

చివరిగా, ప్రవక్తలు కొన్నిసార్లు *ఇష్ ఎలోహీం* (אִישׁ הָאֱלֹהִים), అనగా "దైవజనుడు" అని పిలువబడేవారు. "దైవజనుడు" అను బిరుదును "దేవుడు పంపిన మనిషి" అని కూడా అనువదించవచ్చు. ఈ పేరు ప్రవక్తలు కలిగియున్న ఒక ప్రత్యేకమైన పవిత్ర పాత్రను సూచిస్తుంది. వారు ప్రత్యేకించబడి దేవుని ద్వారా పంపించబడ్డారు. కావున, ప్రవక్తలకు దేవుని నుండి ప్రత్యేక రక్షణ ఉంది, మరియు వారికి ప్రత్యేకమైన అధికారం ఇవ్వబడింది. 2 రాజులు 1:12లో, ప్రవక్తయైన ఏలీయా ఈ పదము యొక్క ప్రాముఖ్యతను ప్రత్యక్షపరచాడు. అక్కడ మనం ఇలా చదువుతాము:

> **అందుకు ఏలీయా "నేను దైవజనుడనైతే అగ్ని ఆకాశము నుండి దిగివచ్చి నిన్ను నీ యేబదిమందిని దహించునుగాక" అని చెప్పగా, ఆకాశమునుండి దేవుని అగ్ని దిగి వానిని వాని యేబదిమందిని దహించెను (2 రాజులు 1:12).**

ఏలీయా యొక్క దైవాధికారము ప్రవక్తకు వ్యతిరేకంగా ఉన్నవారి మీదికి అద్భుతముగా అగ్ని దిగి వచ్చుటతో ప్రత్యక్షపరచబడింది. ఏలీయా ఇక సామాన్యమైన వ్యక్తి కాదు. అతడు దేవుడు పంపినవాడు. దేవుడు అతని పక్షమున ఉన్నాడు.

కాబట్టి పాత నిబంధన ప్రవక్తలకు అనేకమైన పేరులు మరియు శీర్షికలు ఉన్నాయని మనము చూశాము. పాత నిబంధనలో ఉపయోగించబడిన ఈ వివిధమైన పేర్లను మనం అవలోకనము చేశాము. కాని ఒక విషయము మాత్రం మనం స్పష్టంగా చూస్తాము – ప్రవక్తలు సాధారణంగా ప్రజలు ఆలోచన చేసే దానికంటే భిన్నమైన వారు. వారు కేవలం అతీంద్రియులు లేదా జరుగబోయే దానిని గూర్చి ముందుగా తెలియజేసేవారు మాత్రమే కాదు. వారికి వివిధమైన పనులు ఉన్నాయి గనుక వారికి వివిధమైన పేర్లు ఉన్నాయి. మనము పాత నిబంధన ప్రవచనమును అర్థం చేసుకోవాలంటే ప్రవక్త ఎవరు అను విషయము మీద మనకు విస్తృతమైన అవగాహన అనేది ఉండాలి.

## పని పరివర్తనాలు

పాత నిబంధన ప్రవక్తలు కలిగియున్న వివిధమైన పనుల పేర్లను ఇప్పటివరకు మనము పరిశీలించాము. ఇప్పుడు మనము మన రెండవ అంశమును చూద్దాము: ప్రవక్త పనిలో జరిగిన పరివర్తనములు ఏమిటి? నా జీవితములో అనేకమైన పనులు ఉన్నాయి, మరియు వాటిలో ప్రతి ఒక్క దానిని గూర్చి ఒక వాస్తవము ఉన్నది – అవన్నీ పరివర్తన చెందాయి. నేను కొంతకాలం పనిచేసిన తరువాత నాకు తెలిసిన విషయం ఏమిటంటే, ఆ పని ఆరంభంలో ఉన్నదానికంటే కొంత భిన్నంగా ఉంది. సరే, పాత నిబంధన ప్రవక్తల విషయంలో కూడా ఇలాటిదే జరిగింది. వారికి ఒక పని అప్పగించబడింది, కాని బైబిలు చరిత్ర అభివృద్ధి చెందుతుండగా, వారి పనులు పరివర్తనము చెందాయి.

పాత నిబంధన ప్రవక్తల యొక్క పని ఏ విధముగా పరివర్తనము చెందినతో అర్థం చేసుకొనుటకు, ప్రవచనము యొక్క నాలుగు చారిత్రిక మెట్లను గూర్చి ఆలోచించుట సహాయకరంగా ఉంటుంది: రాజులకు మునుపు కాలము – ఇశ్రాయేలులో రాజులు లేని సమయము; రాజుల కాలము; చెర కాలము – దేశము

నుండి చెరగొనిపోబడిన కాలము; మరియు చెర-తరువాత కాలము — చెర నుండి ఇశ్రాయేలు తిరిగి వచ్చిన తరువాత కాలము.

## రాజులకు మునుపు కాలము

రాజులకు మునుపు కాలములోని ప్రవక్తలను మొదటిగా చూద్దాము. ఇశ్రాయేలులో రాజు లేని కాలమును మనం పరిశీలించినప్పుడు, ప్రవచనము యొక్క అనేక లక్షణములను చూడడం సులభంగా ఉంటుంది. మొదటిగా, ఈ కాలములో చాలా తక్కువమంది ప్రవక్తలు ఉండేవారు. *నబి* అను పదము ఆదికాండము నుండి న్యాయాధిపతుల గ్రంథము వరకు కూడా కనిపించదు. ఈ పుస్తకములలో ఇరవై కంటే తక్కువ ప్రస్తావనలు ఉన్నాయి, మరియు వాటిలో కొన్ని రాబోవు భవిష్యత్ ప్రవక్తలను గూర్చి తెలియజేయునవిగా ఉన్నాయి. కాబట్టి రాజులు లేని ఆరంభ కాలములో చాలా తక్కువమంది ప్రవక్తలు ఉండేవారు.

అంతేకాక, రాజుల కాలమునకు మునుపు, ప్రవక్తలు అనేక రకములైన అనధికారిక సేవలను చేసేవారు. వారు చేసిన పనులు చాలా వరకు తాత్కాలికమైనవిగాను, కొన్ని ప్రత్యేకమైన పరిస్థితుల కొరకు మరియు ప్రత్యేకమైన కాలముల కొరకు రూపొందించబడినవిగా ఉండేవి. *నబి* అను పదము రాజుల కాలమునకు ముందు రకరకాల పనులు చేసిన వివిధ రకములైన ప్రజలను గుర్తించుట కొరకు ఉపయోగించబడేది.

## రాజుల కాలము

ఇశ్రాయేలులో రాజుల లేని బైబిలు చరిత్ర యొక్క ఆరంభ కాలము తరువాత, పాత నిబంధన ప్రవచనములో ఒక నాటకీయమైన మార్పును మనము చూస్తాము. రాజుల కాలము ఇశ్రాయేలు రాజ్యములో అనేక మార్పులను తెచ్చింది, మరియు ప్రవక్తల పాత్రలో కూడా మార్పును తెచ్చింది. రాజులులేని కాలమునకు భిన్నముగా, ఈ కాలములో ప్రవక్తలు చాలా ఎక్కువగా ఉండేవారు. సమూయేలు, రాజులు మరియు దినవృత్తాంతములు గ్రంథములలో ఈ ప్రవక్త మరియు ఆ ప్రవక్త అని మనం పదేపదే చదువుతాము. వాస్తవంగా చెప్పాలంటే, ఏ ఇతర కాలము కంటే కూడా బైబిలులోని ఈ కాలములో ఎక్కువమంది ప్రవక్తలు ఉన్నారు.

రాజుల కాలములో ప్రవక్తల యొక్క సంఖ్యాపరమైన అభివృద్ధితో పాటుగా, ప్రవచనము కూడా మరింత అధికారికంగా మారింది. రాజుల ఆగమనముతో, రాజుల కార్యముల మీద, మరియు వారు మోషే ధర్మశాస్త్రమునకు విధేయత చూపుతున్నారా లేదా అను విషయము మీద దృష్టిపెట్టే పని దేవుడు ప్రవక్తలకు అప్పగించాడు. ఇశ్రాయేలుకు మానవ రాజు ఉండాలని దేవుడు ఆశించినను, పతనమైన మానవ రాజులు రాజ్యమునకు గొప్ప ప్రమాదము తెచ్చిపెడతారని ఆయనకు తెలుసు. గొప్ప అధికారమును ఏ విధముగా ఉపయోగించాలో మానవులకు తెలియదు. వారు సాధారణంగా అవినీతిపరులు అవుతారు మరియు వారి ఆధీనములో ఉన్నవారిని దోచుకొనుటకు ప్రయత్నిస్తారు.

ఇశ్రాయేలు చరిత్ర విషయంలో, రాజులు అవినీతిపరులైనప్పుడు, అది చాలా ప్రమాదకరమయ్యేది, ఎందుకంటే వారి చర్యల వలన దేవుడు ప్రజలందరి మీదకి తీర్పుతెచ్చేవాడు. ఈ కారణమును బట్టి, మోషే

రాజుల అధికారము మీద అనేకమైన ఆంక్షలను విధించాడు. ద్వితీయోపదేశకాండము 17:14-20లో మోషే ఇశ్రాయేలు రాజుల మీద అనేకమైన ఆంక్షలు విధించాడు. దేవుడు నియమించినవాడే ఇశ్రాయేలుకు రాజుగా ఉండాలి. రాజు అనేవాడు మీ సహోదరులలో నుండి వచ్చినవాడై ఉండాలి – మరోమాటలలో, ఇశ్రాయేలీయుడై ఉండాలి. రాజు అనేకమైన గుఱ్ఱాలను కలిగి ఉండకూడదు. అతడు ఐగుప్తుకు తిరిగి వెళ్లకూడదు. రాజు అనేకమంది భార్యలను కలిగి ఉండకూడదు – మరియు దీనిని బట్టి మోషే యొక్క అర్థం ఏమిటంటే అనేకమంది విదేశీ భార్యలు. అతడు వెండి మరియు బంగారమును ఎక్కువగా సమకూర్చుకొనకూడదు. రాజు మోషే ధర్మశాస్త్రము యొక్క ఒక ప్రతుని తన కొరకు వ్రాసుకోవాలి. మరియు రాజు తన జీవితకాలమంతయు ధర్మశాస్త్రమును ధ్యానించాలి. అతడు మోషే ధర్మశాస్త్రములోని మాటలను చాలా జాగ్రత్తగా అనుసరించాలి. మరియు అతడు తనను తాను తన సహోదరుల కంటే ఉత్తమునిగా భావించుకోకూడదు.

వాస్తవంగా చెప్పాలంటే, ఇశ్రాయేలు రాజుల చరిత్రను మనం చదివిన వెంటనే, మోషే వారి మీద పెట్టిన ఆంక్షలను వారు పాటించలేదని మనము కనుగొంటాము. కాబట్టి రాజుల యొక్క అవిధేయతకు మరియు వారిని అనుసరించిన ప్రజలకు సాక్ష్యమివ్వడానికి ప్రవక్తలను పంపాడు. రాజుల అధికారమును పరిశీలించడానికి ప్రవక్తలు అధికారిక కార్యాలయమును నిర్వహించారు. ప్రవక్తలు మరియు రాజుల యొక్క ఈ సన్నిహిత అనుబంధమును బైబిలులోని అనేక పేజీలలో మనము చూడవచ్చు. ప్రవక్తయైన నాతాను దావీదు యెదుట నిలచాడు. ఓదేదు ఆహాజుతో ప్రవచించాడు. ఏలీయా ఆహాబును విమర్శించాడు.

ఇప్పుడు, ప్రతి ప్రవక్త కూడా వాస్తవానికి రాజుల న్యాయస్థానంలో అధికారికంగా పని చేయలేదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చాలామంది నిజమైన ప్రవక్తలను తమ కాలములోని రాజులు తిరస్కరించారు. కాని న్యాయస్థానములలోనైనా లేదా నగర వీధులలోనైనా, రాజుల కాలములోని ప్రవక్తలు రాజులను మరియు ఇతర అధికారులను దేవుని ధర్మశాస్త్రమునకు బాధ్యులను చేశారు. రాజులు మరియు అధికారులు దేవుని ధర్మశాస్త్రమును ఉలంఘించినప్పుడు వారి తప్పులను ఎత్తి చూపడం ద్వారా వారు ఈ కాలములో దేవుని పని చేశారు.

కాబట్టి రాజుల కాలములో, అనేకమంది ప్రవక్తలు సంఖ్యాపరముగా పెరుగుటను మనం చూస్తాము, మరియు ప్రవక్తలు న్యాయస్థానములలో ప్రభువును సేవించుచుండగా వారి యొక్క అధికారికమైన పనిని కూడా మనం చూస్తాము.

## చెర కాలము

రాజుల కాలముకు మునుపు నుండి రాజుల కాలము వరకు ప్రవచనంలో జరిగిన కొన్ని పరివర్తనములను ఇప్పటివరకు మనము చూశాము గనుక, ఇప్పుడు మన దృష్టిని చెర కాలమువైపు త్రిప్పుదాము. చెర కాలములో ప్రవచనము ఏమైనది? సరే, క్రీ.పూ. 722లో, ఉత్తర ఇశ్రాయేలు రాజధానియైన సమరయ అష్షూరు చేతిలో పడిపోయింది. మరియు క్రీ.పూ. 586లో యెరూషలేము బబులోనీయుల చేతిలో పడిపోయింది. అనేకమంది దేవుని ప్రజలు తమ ప్రదేశము నుండి ఇతర దేశములకు చెరగొనిపోబడ్డారు. ఈ కాలములో, ప్రవక్తల పరిచర్యలను రెండు లక్షణాలు వర్ణిస్తాయి. మొదటిగా, ప్రవక్తలు సంఖ్యాపరముగా తగ్గిపోయారు. తమ ప్రవచనములను బైబిలులో

నమోదుచేయడానికి తగినంతమంది ప్రాముఖ్యమైన ప్రవక్తలు లేరు. ఉదాహరణకు, ఈ కాలములో ఉన్న తక్కువమంది ప్రవక్తలలో దానియేలు మరియు యెహెజ్కేలు ప్రసిద్ధి చెందినవారు.

వాస్తవానికి, చెరతో పాటుగా ఇశ్రాయేలు రాజ్యము కూడా నాశనమైపోయింది, మరియు ఈ కారణంగా ప్రవక్తలు దేవునికి చేసే సేవ మరింత వైవిధ్యంగా మరియు అనధికారికంగా మారింది. చాలావరకు, దేవుని యొక్క నిజమైన ప్రవక్తలు చెరను గూర్చి మరియు దేశముకు తిరిగివచ్చే అవకాశమును గూర్చి దేవుని ప్రజలకు వివరిస్తూ తమ కాలమును వెళ్లబుచ్చారు. కాబట్టి చెర కాలములో చాలా తక్కువమంది ప్రవక్తలు ఉన్నారని మనం చూస్తాము, మరియు వారు ఇశ్రాయేలు రాజులను గూర్చి చాలా తక్కువగా మాట్లాడారు.

### చెర-తరువాత కాలము

చెర-తరువాత కాలములో ప్రవచనాత్మక కార్యకలాపాలను చూసిన కొన్ని తరములను మనం చూస్తాము. చెర-తరువాత కాలములోని ఆరంభ భాగము యొక్క నాయకుడైన జెరుబ్బాబెలు, రాజ్యమును పునరుద్ధరించుట ఆరంభించాడు. రాజరికము పునఃస్థాపించబడు సంభావ్యత తలెత్తింది. తత్ఫలితంగా, ప్రవచనమునకు రెండు విషయాలు జరిగాయి. ప్రవక్తలు సంఖ్యాపరముగా తక్కువగానే మిగిలిపోయారు, కాని ప్రవక్తల మధ్యలో కొన్ని చాలా ప్రాముఖ్యమైన కార్యములు జరిగాయి. ఈ కాలములో మనకు తెలిసిన ముఖ్యమైన ప్రవక్తలు హగ్గయి, జెకర్యా మరియు మలాకీ.

ప్రవక్తలు మరొకసారి అధికారికమైన స్థానమును అధిరోహించుట ఆరంభించారు. జెరుబ్బాబెలు యూదా దేశ అధిపతి అయ్యాడు, మరియు రాబోవు రాజుగా అతని మీద ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. తత్ఫలితంగా, దేవాలయమును పునఃనిర్మించమని హగ్గయి మరియు జెకర్యా ఇశ్రాయేలు అధికారులను ప్రోత్సహించారు. దేవునికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నందున పునరుద్ధరించబడిన అధికారులను మరియు ప్రజలను మలాకీ మందలించాడు. చెర-తరువాత కాలములో దేవునికి నమ్మకముగా ఉండమని ప్రవక్తలు నాయకులను మరియు సామాన్య ప్రజలను ప్రోత్సహించారు.

కాబట్టి రాజరిక వ్యవస్థ ఎదుగుట మరియు పడిపోవుట ఆధారంగా ప్రవచనములో కూడా మార్పులు జరిగాయి. మనము కొందరు ప్రవక్తల యొక్క మాటలను విశదీకరించునప్పుడు, మనము రాజులకు మునుపు కాలములో ఉన్నామా, రాజుల కాలములో ఉన్నామా, చెర-కాలముమా, లేదా చెర-తరువాత కాలములో ఉన్నామా అను విషయమును ఎల్లప్పుడు దృష్టిలో ఉంచుకోవాలి. ప్రవక్తల పనిలోని ఈ పరివర్తనలు వారి యొక్క మాటలను అర్థము చేసుకొనుటలో మనకు సహాయము చేస్తాయి.

## పని అంచనాలు

ఇప్పటివరకు, ప్రవక్తలకు ఇవ్వబడిన వివిధ పేర్లను, మరియు ఇశ్రాయేలు చరిత్రలో ప్రవచనము అభివృద్ధి చెందిన మార్గములను మనము పరిశీలించాము. ఈ సమయంలో, ప్రవక్తల పనిపై పెట్టబడిన అంచనాలను చూచుటకు సిద్ధముగా ఉన్నాము. ప్రవక్తలు ఏమి చేయాలని దేవుడు ఆశించాడు? ఈ

అంశమును విశదీకరించుటకు రెండు విషయాలను మనం చూద్దాము: మొదటిగా, అనేకమంది బైబిలు అనువాదకులు ప్రవక్తలకు అనువర్తించే అంచనాల యొక్క సుప్రసిద్ధ నమూనాలు, మరియు రెండవదిగా, ప్రవక్త పనిపై ఉన్న అంచనాల యొక్క ప్రామాణికతను గూర్చి స్వయంగా బైబిలు ఇచ్చు నిబంధన నమూన.

## సుప్రసిద్ధ నమూనాలు

దేవుడు తన ప్రవక్తలు ఏమి చేయాలని ఆశించాడో వివరించుటకు ఉపయోగించబడిన కొన్ని నమూనాలను మొదటిగా చూద్దాము. అనువాద చరిత్రయంతటా, యూదులు మరియు క్రైస్తవులు ప్రవక్తల పాత్రలను వివిధ రకాలుగా అర్థం చేసుకున్నారు. వీటిలో కొన్ని నమూనాలు సత్యమునకు సంబంధించిన అంశములను గూర్చి మాట్లాడతాయి, కాని దేవుడు తన ప్రవక్తలు ఎలా ఉండాలని ఆశించుచున్నాడో దానికి సమగ్రమైన నమూనాను అందించుటలో మాత్రం విఫలమైయ్యాయి.

### శకునము/షమన్

అనేకమంది వ్యాఖ్యాతలు పాత నిబంధన ప్రవక్తలను ఇతర సంస్కృతుల శకునములతో పోల్చుతారు. డెల్ఫి దేవోక్తి లేదా ఇతర ప్రాచీన పశ్చిమ ఆసియా సంస్కృతులలోని శకునముల వలెనే, ప్రవక్తలు దేవుని ప్రాప్యతను పొంది, వ్యక్తిగత ప్రశ్నలు మరియు ప్రార్థనలకు ఆయన యొక్క ప్రతిస్పందనలను అందించేవారిగా ఉన్నారని వారు భావించారు. ఇప్పుడు, బైబిలులోని ప్రవక్తలు అప్పుడప్పుడు ఈ విధమైన పాత్రను పోషించారను విషయమును మనం ఒప్పుకోవాలని నా ఆలోచన, కాని మనము చూడబోవుచున్నట్లుగా ప్రవక్తలు చేయవలసియుండిన పనికి సమగ్ర నమూనాను ఈ దృక్పథము అందించదు.

### భవిష్యత్తును తెలిపేవారు

పాత నిబంధన గ్రంథములో ప్రవక్తలు ఏమి చేశారు అను విషయమును గూర్చిన మరొక సుప్రసిద్ధ ఆలోచన ఏమిటంటే వారు భవిష్యత్తును గూర్చి చెప్పేవారు, లేదా భవిష్యత్తును ముందుగా తెలిపేవారు. తరువాత ఏమి జరుగబోతుంది అని ఎవరైనా తెలుసుకొనాలని ఆశించినప్పుడు, దానిని కనుగొనుటకు వారు ప్రవక్త యొద్దకు వెళ్లేవారు. మరొకసారి, భవిష్యత్తులో ఏమి జరుగబోతుందో ప్రవక్తలు ఎల్లప్పుడు ముందుగానే చెప్పారు కాబట్టి ఈ దృక్పథములో కూడా కొంత వాస్తవము ఉంది. దేవుడు వారికి కొన్ని అంతర్దృష్టులను ఇచ్చాడు మరియు వారు ఈ అంతరదృష్టులను తగిన వ్యక్తులకు ప్రకటించారు. అయినను భవిష్యత్తును గూర్చి ముందుగానే చెప్పుట మాత్రమే పాత నిబంధన యొక్క కేంద్రభాగము అని మనం తలంచకూడదు. పాత నిబంధన ప్రవక్తల నుండి మరింత విస్తృతమైన మరియు మరింత ప్రాముఖ్యమైన విషయాలు ఆశించబడినవి.

## నిబంధన నమూన

ప్రవచనమును గూర్చిన ఈ సుప్రసిద్ధ నమూనాలు కొన్ని విధాలుగా మనకు సహాయపడతాయి, కాని దేవుడు తన ప్రవక్తల నుండి ఆశించిన అత్యంత ప్రాథమిక ఆపేక్షను గూర్చి అవి స్పష్టతను ఇవ్వవు.

పాత నిబంధన గ్రంథము ప్రవచనమును వివరించడానికి ఉపయోగించే అత్యంత సమగ్రమైన నమూనా నిబంధన నమూన. ప్రవచనమును గూర్చిన నిబంధన నమూనను పరిశీలించుట ఆరంభించినప్పుడు, శతాబ్దములుగా యూదులు మరియు క్రైస్తవులు బైబిలులోని నిబంధనను ఒక ప్రధానమైన అంశముగా భావించారని మనం జ్ఞాపకముంచుకోవాలి. కానీ నిబంధన అంశమును గూర్చిన బైబిలు ఆలోచన మీద మన అవగాహన సంవత్సరముల తరబడి మెరుగుపడింది. కాబట్టి, నిబంధనను గూర్చిన గత అవగాహనలను మరియు మరింత సమకాలీన అవగాహనలను ఆలోచించుట ద్వారా మనం ఆరంభించాలి.

## గత అవగాహనలు

నిబంధనను గూర్చిన గత అవగాహనలు బాగుగా పనిచేశాయి, కాని ఇవి నిబంధన అను బైబిలు అంశము అభివృద్ధి చెందిన చారిత్రిక సందర్భమును గూర్చి సరైన అవగాహన కలిగియుండలేదు. ఇటీవల కాలము వరకు కూడా పాత నిబంధనలోని నిబంధనల యొక్క ప్రాచీన పశ్చిమ ఆసియా సందర్భములను గురించి మనకు అంతగా తెలియదు. కాబట్టి, వేదాంతపండితులు తమ ఆలోచనలను బైబిలులోని నిబంధనల మీద రుద్దుట తప్ప వేరే మార్గం లేకపోయింది. సాధారణంగా, వారు పాత నిబంధనలోని నిబంధనలను రోమా నియమము ఆధారంగా లేదా సమకాలీన చట్టపరమైన ఏర్పాట్ల ఆధారంగా అధ్యయనం చేశారు. ఉదాహరణకు, చాలాసార్లు చెప్పబడునట్లుగా నిబంధన అనునది ఇద్దరు లేదా అంత కంటే ఎక్కువ మంది మధ్య జరిగే ఒప్పందము అని మనం వినినప్పుడు, ఈ సూత్రీకరణ లేదా ఇతర సారూప్య సూత్రీకరణలు పూర్తిగా తప్పుకాదు గాని అవి మనకు అంతగా సహాయపడవు.

## సమకాలీన అవగాహనలు

వారికి వేరే అవకాశం లేదు కాబట్టి గతములో వేదాంతపండితులు ఈ సాధారణమైన పద్ధతిలో నిబంధనను అర్థం చేసుకున్నారు. కాని నిబంధనను గూర్చిన మన సమకాలీన అవగాహన ఈ గత సూత్రీకరణలకంటే పరిపూర్ణమైనదిగా ఉన్నది. ఇటీవల దశాబ్దములలో, పాత నిబంధనలోని నిబంధనల మీద మన అవగాహనను బలపరచుటలో అనేక ముఖ్యమైన పురావస్తుశాస్త్ర పరిశోధనలు సహాయం చేశాయి. పాత నిబంధన ప్రవక్తల యొక్క పనిని గూర్చిన అంచనాలను నిబంధన ఏ విధంగా స్థాపించినదో అర్థం చేసుకొనుటకు ఈ పురోగతి మనలను ఒక ఉత్తమమైన స్థానములో ఉంచుతుంది. ప్రాచీన ప్రపంచంలో ఉనికిలో ఉన్న రాజకీయ ఒప్పందములకు సారూప్యముగా ఉన్న విధానములలో పాత నిబంధన ఎల్లప్పుడు ఇశ్రాయేలుతో దేవుని సంబంధమును గూర్చి వివరిస్తుందని ప్రాచీన పశ్చిమ ఆసియా ఆవిష్కరణలు తెలియజేశాయి. ప్రాచీన ప్రపంచములోని పశ్చిమ ఆసియా ప్రాంతమంతటా, ఒక రాజ్యము మరియు మరొక రాజ్యమునకు మధ్య తరచుగా ఒప్పందాలు ఉండేవి. ఈ ఒప్పందములు ఏర్పడిన విధానములో వైవిధ్యం ఉన్నప్పటికీ, అనుగుణ్యత కూడా ఉంది తద్వారా ఆ ప్రాంతములోని ప్రజలు ఈ ఒప్పందములు ఎలా జరిగేవో అర్థం చేసుకున్నారు. ఈ కారణమును బట్టి, అనేక విధాలుగా ఈ ప్రాచీన పశ్చిమ ఆసియా ఒప్పందములకు సమాంతరంగా ఉన్న నిబంధనల ద్వారా దేవుడు ఇశ్రాయేలుతో అనుబంధపరచుకున్నాడు.

బైబిలు కాలములో, ఒకే స్థాయిలో ఉన్న రెండు రాజ్యముల మధ్య ఒప్పందములు జరిగేవి, మరియు ఈ ఒప్పందములను మనము సమానత్వ ఒప్పందములు అని పిలుస్తాము. ఉదాహరణకు,



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

ఐగుప్తు మరియు అష్షూరు రాజ్యాల మధ్య జరిగిన ఒప్పందము చరిత్రలోని కొన్ని కాలములలో సమానుల మధ్య జరిగినదిగా ఉన్నది. కాని చాలాసార్లు, ప్రాచీన ప్రపంచములోని ఒప్పందములు అనేవి ఒక గొప్ప చక్రవర్తికి మరియు ఒక నగరము లేదా ఒక చిన్న రాజ్యము యొక్క రాజుకు మధ్య జరిగేవిగా ఉండేవి. ఉదాహరణకు, కనాను నగర-రాష్ట్రాల రాజులు గొప్ప ఐగుప్తు సామ్రాజ్యముతో ఒప్పందములు చేసుకునేవారు. ఈ విధమైన ఒప్పందములు ప్రభువు-సామంత ఒప్పందములుగా పిలువబడతాయి. "ప్రభువు" అను పదమునకు అర్థము "జార్" లేదా "చక్రవర్తి," మరియు సామంత అనగా, వాస్తవానికి, ఆ గొప్ప చక్రవర్తి యొక్క సేవకులు అని అర్థం. ప్రభువులు, లేదా గొప్ప చక్రవర్తులు, వారి మధ్య అనుబంధమునకు నియమాలను స్థాపించి మరియు భద్రతను, సంరక్షణను అందించారు. ప్రతిగా, సామంతులు లేదా సేవక రాష్ట్రాలు పన్నులు చెల్లించుట ద్వారా మరియు అతని యుద్ధ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం ద్వారా ప్రభువుకు విధేయత చూపించారు.

ఈ ప్రభువు-సామంత ఒప్పందముల యొక్క ఒక ముఖ్యమైన లక్షణం ఏమిటంటే చక్రవర్తులు ప్రతినిధులకు లేదా దూతలకు ఇచ్చినటువంటి ప్రత్యేకమైన పాత్ర. ప్రభువులు ఎల్లప్పుడు ప్రతినిధులను లేదా దూతలను పంపేవారు తద్వారా వారు సామంత రాజ్యములకు తమ యొక్క ఒప్పందములను గూర్చి జ్ఞాపకం చేసేవారు. ఈ దూతలు నిబంధన ఒప్పందము యొక్క న్యాయవాదులుగా వ్యవహరించేవారు. వారు తమ ఒప్పందముల యొక్క నిబంధనలను పాటించడానికి సమ్మతించునట్లు సామంత రాష్ట్రాలను పురికొల్పేవారు. ఇప్పుడు, చక్రవర్తులు తమ యొక్క సామంత రాజ్యములతో చాలా ఓర్పుగా వ్యవహరించేవారు, కాని చివరికి, ఒకవేళ సామంత రాజ్యము దూత యొక్క మాటలను తిరస్కరించినట్లైతే, ఆ చిన్న రాజ్యములను ఓడించుటకు గొప్ప చక్రవర్తి తన యొక్క సైనిక దళముతో కూడా వచ్చేవాడు.

ప్రాచీన పశ్చిమ ఆసియాలోని దూతల యొక్క పని పాత నిబంధన ప్రవక్తలకు ఒక నమూనాను అందించింది. ప్రవక్తలు దేవుని యొక్క నిబంధనా దూతలుగా లేదా ఆయన యొక్క నిబంధన న్యాయవాదులుగా పనిచేశారు. దైవిక చక్రవర్తి యొక్క సింహాసనము యొద్ద నుండి వారు తమ సందేశములను పొందుకునేవారు, మరియు దైవక చక్రవర్తి వారి ద్వారా ఆయన యొక్క సామంత రాజ్యముతో మాట్లాడేవాడు. ఇశ్రాయేలు దాని నిబంధన షరతులను పాటించినప్పుడు ప్రవక్తలు కొన్నిసార్లు ప్రశంసించారు, కాని వాటిని ఉల్లంఘించినప్పుడు దేవుని ఉగ్రత వస్తుందని వారు హెచ్చరించారు.

పాత నిబంధన ప్రవచనములోని ఈ దృక్కోణమును అతిగా ఉద్ఘాటించుట కష్టమే. ప్రవక్తలు దేవుని దూతలు. ఆయన తన సామంత రాజ్యమైన ఇశ్రాయేలుకు గొప్ప ప్రభువుగా ఉన్నాడని వారు సూచించారు. ఈ ప్రాథమిక నిబంధన నమూనాను మనం జ్ఞాపకం చేసుకున్నప్పుడే ప్రవక్తలు దేవుని కొరకు చేసిన పనిని మనం అర్థం చేసుకోగలుగుతాము.

యెషయా 6లోని సుప్రసిద్ధమైన కథనము ఈ దూతల నమూనా యొక్క ప్రాముఖ్యతను స్పష్టం చేస్తుంది. ఈ అధ్యాయములో నిబంధనను గూర్చి స్పష్టముగా ప్రస్తావించకపోయినప్పటికీ, ప్రవక్తలు నిబంధనా న్యాయవాదులు – గొప్ప రాజు పక్షమున ఉన్న దూతలు – అను ఆలోచన యెషయా 6 యొక్క చిత్రీకరణను నియత్రించింది. మొదటి ఐదు వచనములలో, యెషయా దర్శనము పొందాడు. ఈ దర్శనములో, దేవుడు సింహాసము మీద ఆసీనుడై ఉండుట అతడు చూశాడు. యెషయా 6:1లో, ప్రవక్త ఇలా చెప్పాడు:



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

అత్యున్నతమైన సింహాసనమందు ప్రభువు ఆసీనుడైయుండగా నేను చూచితిని;
ఆయన చొక్కాయి అంచులు దేవాలయమును నిండుకొనెను (యెషయా 6:1)

ఆ దృశ్యమును చూసిన తరువాత, 5వ వచనములో, యెషయా ఇలా పేర్కొన్నాడు:

రాజును సైన్యములకధిపతియునగు యెహోవాను నేను కన్నులార
చూచితిననుకొంటిని (యెషయా 6:5).

ప్రవక్త తన దేవునిని ఏ విధముగా అర్థం చేసుకున్నాడో ఈ వాక్యభాగము స్పష్టం చేస్తుంది. దేవుడు తన ప్రజల యొక్క రాజైయున్నాడు, మరియు అందరికీ ప్రభువుగా హెచ్చించబడిన ప్రభువు లేదా చక్రవర్తి అయ్యున్నాడు. ఈ దైవికమైన ప్రభువు సన్నిధిలోనికి ప్రవేశించే హక్కు ప్రవక్తకు ఉండినది.

అయినప్పటికీ, దేవుని సింహాసనము యొక్క అద్భుతమైన దృశ్యమును చూడడానికి యెషయా ఎందుకు ఆహ్వానించబడ్డాడు అను ప్రశ్నను మనం అడగాలి. ఎందుకో అతడు వెంటనే గుర్తించాడు. యెషయా అతని ప్రభువు యొక్క సింహాసనము వైపుకు చూసి 6:5లో ఇలా అన్నాడు:

అయ్యో, నేను అపవిత్రమైన పెదవులు గలవాడను; అపవిత్రమైన పెదవులుగల
జనుల మధ్యను నివసించువాడను; నేను నశించితిని (యెషయా 6:5).

తీవ్రమైన, విస్తృతమైన పాపము సామంత రాజ్యములో చోటుచేసుకొంది గనుక యెషయా దైవికమైన ప్రభువు సమక్షంలోనికి ఆహ్వానించబడ్డాడు. పాత నిబంధనలో ప్రవక్తలు పిలువబడడానికి ఇది ఒక సాధారణమైన కారణమై ఉంది. దేవుని ప్రజలు తమ నిబంధన ప్రభువుకు నమ్మకంగా లేనందున, నిబంధనను విచారించుటకు దేవుడు ఆయన యొక్క ప్రవక్తలను పిలచాడు.

యెషయా 6:6-7లో సెరాపులలో ఒకడు యెషయా యొద్దకు వచ్చి అతని పెదవులను కారుతో తీసిన నిప్పుతో కాల్చాడు. ఈ ప్రక్షాళన వలన యెషయా దేవుని ప్రతినిధిగా సేవ చేయు అర్హతను పొందాడు. అటుతరువాత వచనములు 8 నుండి 13లో నిబంధనను విచారించుమను ఆజ్ఞను యెషయా పొందాడు. యెషయా 6:8లో ప్రభువు ఇలా సెలవిచ్చాడు:

నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవును? (యెషయా 6:8).

తన యొక్క దూతగా ఇశ్రాయేలుకు ఎవరైనా వెళ్లాలని ప్రభువు కోరినప్పుడు, యెషయా ఈ ప్రసిద్ధమైన మాటలు పలుకుతూ జవాబిచ్చాడు:

నేనున్నాను! నన్ను పంపుము! (యెషయా 6:8).

గొప్ప ప్రభువు యొద్ద నుండి ఇశ్రాయేలు సామంత రాజ్యమునకు పంపబడిన వ్యక్తిగా యెషయా తన పిలుపును అంగీకారించాడు. యెషయా గ్రంథములోని మిగిలిన భాగము ప్రవక్త ఈ పనిని ఏ విధముగా చేశాడో తెలియజేస్తుంది. అతడు రాజులతోను, ఇతర నాయకులతోను మరియు ప్రజలతోను మాట్లాడాడు. అతడు నిబంధన ఉల్లంఘనలను ఖండించి, నిబంధన ఆశీర్వాదముల యొక్క నిరీక్షణను దేవుని ప్రజలకు అందించాడు. ఇక్కడ యెషయా 6లో ఉదహరించబడిన నమూనా పాత నిబంధన ప్రవచనమంతటిలో కనిపిస్తుంది. ప్రవక్తలు సింహాసనము మీద ఆసీనుడైయున్న గొప్ప ప్రభువు యొద్ద

నుండి సందేశమును పొందుకొని, ఆ సందేశములను ఆయన యొక్క సామంత రాజ్యమైన ఇశ్రాయేలుకు అందించే దూతలుగా ఉన్నారు.

## ముగింపు

ఈ పాఠంలో ప్రవక్తల యొక్క పనిని గూర్చి పరిశీలించుట ద్వారా వారి యొక్క అనుభవమును మనము పరిశీలించాము. వారు పొందుకొనిన అనేక పనుల పేర్లలో కొన్నింటిని మనం చూశాము, మరియు ప్రవక్త కార్యాలయము ఏ విధముగా అభివృద్ధి చెందినదో మరియు ఇశ్రాయేలు చరిత్రలో అది ఏ విధముగా పరివర్తన చెందినదో మనము చూశాము. చివరిగా, ప్రవక్త యొక్క పనిని నియంత్రించే ప్రాథమిక అంచనాలను చూశాము.

పాత నిబంధన ప్రవక్తలను గూర్చి ప్రజల మధ్య అనేక సందేహములు ఉన్నాయి, మరియు కేవలం వారి యొక్క పనుల పేర్లను, జరిగిన పరివర్తనములను, మరియు ప్రవక్తలు ఆయన యొక్క నిబంధనలను ప్రతిబింబించు విధముగా ఉంటారను నిరీక్షణను దేవుడు కలిగియుండుటను జ్ఞాపకం చేసుకొనుట ద్వారా ఆ సందేహమును మనం నివారించవచ్చు. ప్రవక్తలను గూర్చిన ఈ విషయములను మనం జ్ఞాపకం చేసుకుంటే, వారి మాటలను నేటి మన ప్రపంచమునకు అనువర్తించగలుగుతాము.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి